క్లుప్తంగా

పోలసానిపల్లిలో కొండ చిలువ హతం



పోలసానిపల్లిలో గ్రామస్తుల చేతిలో హతమైన కొండ చిలువ

భీమడోలు: పోలసానిపల్లి సాయిబాబా గుడి ప్రాంతంలో ఓ కొండ చిలువ శుక్రవారం అర్థరాత్రి గ్రామస్తుల చేతిలో హతమైంది. ఆరడుగుల పొడవు గల కొండ చిలువ జనావాసాల మధ్య సంచరించడంతో స్థానికులు భయాందోళనతో పరుగులు తీసారు. రెండు రోజుల క్రితం గుడి సమీపంలోని ఓ ఇంటికి పోలవరం కుడి కాలువ నుంచి గ్రావెల్ తోలారు. ఈ క్రమంలో ఆ గ్రావెల్‌లో కొండ చిలువ చిక్కుకుని వచ్చింది. అయితే కొండ చిలువ అర్థరాత్రి సమయంలో బయటకు రావడం స్థానికుల కంట పడింది. దీనితో వారంతా భయపడ్డారు. గ్రామంలోని యువకులు కర్రలతో కొట్టి ఆ కొండ చిలువను హతమార్చారు. దీనితో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సీతంపేట కాలువలో ట్రాక్టర్‌తో దమ్ము



ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

దెందులూరు: దెందులూరు మండలంలోని సీతంపేట పంట కాలువల్లో ట్రాక్టర్‌తో దమ్ము చేసి తూడు తొలగింపు పనులు చేపట్టారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు పర్వతనేని రంగారావు పర్యవేక్షణలో ఈ పనులు చేస్తున్నారు. సీతంపేట కాలువలో తూడు, కర్రనాచు పెరిగి సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. రైతుల ఇబ్బందులు తొలగించేందుకు, సాగునీటి ప్రవాహాన్ని మెరుగుపర్చేందుకు తూడు తొలగింపు పనులు చేపట్టినట్టు ఆయన తెలిపారు. కాలువ గట్లకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా దమ్ము పనులు చేస్తున్నట్టు రంగారావు అన్నారు.

కైకరంలో పట్టపగలే చోరీ



ఇంట్లో బీరువాను పడేసిన దృశ్యం

ఉంగుటూరు : కైకరంలో శనివారం పట్టపగలే చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బ్యాంకు ఉద్యోగి మన్నె సతీష్ కుమార్ ఇంటికి తాళం వేసి తన కుటుంబంతో కలిసి పని నిమిత్తం శనివారం మధ్యాహ్నం తాడేపల్లిగూడెం వెళ్లారు. తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లే చూసేసరికి వస్తువులు చెల్లాచెదురుగా ఉన్నాయి. రూ.60 వేలు నగదు చోరీ అయినట్లు గుర్తించి సతీష్‌కుమార్ చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వరి నాట్లు వేసిన గురుకుల విద్యార్థినులు



వట్లూరు వరి పొలంలో నాట్లు వేస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థినులు

పెదపాడు: వట్లూరు గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు శనివారం క్షేత్ర పర్యటనలో భాగంగా వరి పొలాలను సందర్శించి వరి నాట్లు వేసారు. ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణితో పాటు ఉపాధ్యాయులు, 10వ తరగతి విద్యార్థులు వట్లూరులోని పంట పొలాల్లో సందడి చేశారు. వరి నాట్లు వేయడం నుంచి నూర్పిడి వరకు వరకు రైతులు చేసే పనులను పరిశీలించారు. వ్యవసాయ రంగంలో రైతులు పడే కష్టనష్టాలను తెలుసుకున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఏలూరుకు చెందిన మొగలాపు దీప్తి శనివారం రూ.1,00,011 విరాళంగా అందజేశారు. తొలుత కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్రీవారి క్షేత్రంలో సందడి

ద్వారకాతిరుమల: శ్రీవారికి ప్రీతికరమైనరోజు కావడంతో ద్వారకాతిరుమల దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనార్థం వేలాదిగా వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. అనివేటి మండపంలో పలువురు మహిళలు ప్రదర్శించిన కోలాట నృత్యాలు అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. ఆదివారం రద్దీ మరింతగా పెరిగే అవకాశం ఉందని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

ఆఖరి మజిలీకీ అవస్థలే..

- ఆక్రమణ చెరలో కొత్తగూడెం శ్మశాన వాటిక
- అంత్యక్రియల నిర్వహణ సమయంలో ఇక్కట్లు
- చెరువు చుట్టూ తుప్పలు పెరిగి దారి లేని వైనం



కొత్తగూడెంలో ఆక్రమణకు గురైన శ్మశాన వాటిక స్థలం (సిమెంట్ స్తంభాలు పాతిన ప్రాంతం)

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం తిమ్మయ్యపాలెం కొత్తగూడెంలో శ్మశాన వాటిక సమస్యతో స్థానిక ప్రజలు ఎంతో కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాన్ని ఆనుకుని పీసపాటివారి చెరువు 8 ఎకరాల 66 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. దానిలో పక్కన రెండు ఎకరాల్లో శ్మశాన వాటికగా గ్రామస్తులు వినియోగించుకునేవారు. ఆ చెరువుని ఆనుకుని ఉన్న రైతులు శ్మశాన వాటిక భూమిని మూడొంతుల్లో రెండు వంతులు ఆక్రమించుకున్నారు. దాంతో కొత్తగూడెంలో పలు సామాజిక వర్గాల ప్రజలు మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు, దహన సంస్కారాలు చేయడానికి స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో వాగులో నీరు పొంగిపొర్లుతోంది. దీంతో దహన సంస్కారాల నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శవాన్ని శ్మశానంలో ఉంచి చిట్టడవిలా పెరిగిన తుప్పలను శుభ్రం చేసుకున్న అనంతరం ఖననం, లేదా దహన సంస్కారాలు చేయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామానికి చెందిన యువకులు నడుం బిగించారు. ఆక్రమణలు తొలగించి శ్మశాన వాటికను రక్షించాలని తహసీల్దారు ప్రసాదుకు, ఎంపీడీవో రాజ్‌మనోజుకు ప్రజా ఫిర్యాదుల విభాగంలో అర్జీ అందజేశారు. శ్మశాన వాటిక భూమిని ఆక్రమణ చెర నుంచి రక్షించాలని ఫిర్యాదులో ప్రజలు అధికారులను కోరారు.



శ్మశాన వాటికను ఆనుకుని ఉన్న చెరువుకు వెళ్లే మార్గం లేకుండా పెరిగిన తూడు

అపరిశుభ్రంగా శ్మశాన వాటిక



కొత్తగూడెం గ్రామంలో శ్మశాన వాటికలో మొక్కలు మొలిచి అపరిశుభ్రంగా తయారైంది. చెరువుగట్టునే శ్మశాన వాటిక ఉంది. పక్కనే ఉన్న రైతు ఈగట్టును ఆక్రమించడంతో శ్మశాన వాటిక స్థల విస్తీర్ణం తగ్గుతోంది. సరైన దారి లేక అంత్యక్రియల నిర్వహణకు వెళ్లే వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– ముక్కుగంగమ్మ, కొత్తగూడెం

చెరువులో స్నానానికి అవకాశం లేదు



శ్మశాన వాటికలోని చెరువుకు వెళ్లేందుకు సరైన దారిలేక ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చిమొక్కలు పెరిగి రుద్రభూమి చిట్టడవిని తలపిస్తోంది. సమీప గ్రామాల్లో శ్మశాన వాటికల్లో స్నానాలకు పైపులు అమర్చారు. రోడ్డు, నీటి వసతి తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– మాగంటి పెద్దింట్లు, కొత్తగూడెం

దివ్యాంగుల పాఠశాలకు రూ.50 వేల విరాళం

పెదపాడు : దివ్యాంగులకు సేవచేయడం దైవసేవతో సమానమని ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు తెలిపారు. శనివారం అప్పనవీడులోని ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాలలో ఆయన విద్యార్థులకు దుప్పట్లు, అల్పాహారం అందించారు. అనంతరం పాఠశాల నిర్వహణ కోసం రూ.50 వేల నగదును విరాళంగా అందించారు. పాఠశాల నిర్వహణకు తనవంతు సహకారం అందిస్తానని ఆయన చెప్పారు.

అసిస్టెంట్ పాస్టర్‌గా ప్రాక్టికల్ ట్రైనింగ్

దెందులూరు: బైబులు ట్రైనింగ్ పూర్తి చేసి ఖాళీగా ఉంటున్న వారు సంప్రదిస్తే వారికి అసిస్టెంట్ పాస్టర్‌గా శిక్షణనిస్తామని మన్నా చర్చ్ పాస్టర్ జ్యోతి రాజు శనివారం తెలిపారు. బైబిల్ ట్రైనింగ్ పూర్తి చేసిన వారిని మంచి సేవకులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని, ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

31న పెన్షన్ల పంపిణీ

దెందులూరు: దెందులూరు మండలంలో ఈనెల 31న పెన్షన్లు నగదు పంపిణీ చేస్తామని దెందులూరు ఎంపీడీఓ కే. శ్రీదేవి శనివారం తెలిపారు. సచివాలయ ఉద్యోగులు నగలు పంపిణీకి సిద్ధం కావాలన్నారు. ఈఓఆర్‌డీతోపాటు అన్ని గ్రామాల కార్యదర్శులు పెన్షన్ నగదు పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తామని ఆమె వివరించారు.

జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలో ప్రథమస్థానం



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిబ్బంది

గణపవరం: గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజి విద్యార్థిని అపరంజితకు జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రథమస్థానం లభించిందని ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి తెలిపారు. శనివారం భీమవరంలోని గ్రంధి వెంకటేశ్వరరావు కాలేజి ఆవరణలో నిర్వహించిన జిల్లాస్థాయి వినియోగదారుల హక్కుల అవగాహన కార్యక్రమంలో నిర్వహించిన వక్తృత్వ పోటీలో బీకాం మూడో ఏడాది చదువుతున్న ఎం.అపరంజితకు ప్రథమ స్థానం లభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నిర్మలకుమారి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇతర కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనాలని సూచించారు. శనివారం అపరంజితను కాలేజిలో ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి మధురాజు, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ సీహెచ్ చైతన్య, అధ్యాపకులు టి.అక్కిరాజు, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలను పరిష్కరించడమే లక్ష్యం



సూరప్పగూడెంలో రెవెన్యూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్తున్న ప్రజలు

భీమడోలు: దీర్ఘకాలికంగా ఉన్న రెవెన్యూ సమస్యలన్నింటినీ పరిష్కరించడమే సదస్సుల లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి ఆర్‌వీ నాగరాణి అన్నారు. సూరప్పగూడెంలో శనివారం మీ భూమి మీ హక్కు అనే కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తహసీల్దార్ బి.రమాదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌వీ నాగరాణి మాట్లాడుతూ భూ సమస్యలన్నింటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. పలు సమస్యలను రైతులు, గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. 21 అర్జీలు అందగా వాటిలో 9 సమస్యలను పరిష్కరించినట్లు ప్రత్యేకాధికారి తెలిపారు. అనంతరం పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ధర్మారావు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాగుపాడులో రెవెన్యూ సదస్సు

ఉంగుటూరు: కాగుపాడులో రెవెన్యూ సదస్సు శనివారం నిర్వహించారు. తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో మూడు అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. 1బీ అడంగుల కాపీ కోసం రెండు అర్జీలు, పేరు తప్పును సరిచేయాలని మరొక అర్జీ అందాయని తెలిపారు. సర్పంచి కడియాల సుదీప్ష, చిట్టిబాబు, వీఆర్వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గొల్ల బాబూరావును కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



ఏలూరులో గొల్ల బాబూరావును సత్కరించిన వైఎస్సార్‌సీపీ నేతలు

భీమడోలు: ఏలూరులో శనివారం వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావును భీమడోలు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసారు. భీమడోలులోని పార్టీ నేతలు, చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి అంబటి నాగేంద్రప్రసాద్ గొల్ల బాబూరావుకు పుష్పగుచ్ఛాన్ని అందించి దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దళితులకు కీలక పదవులను కేటాయించిన ఘనత వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాజ్యసభకు దళితుడు గొల్ల బాబూరావును పంపించి దళిత పక్షపాతిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. చంద్రబాబు గతంలో రాజ్యసభకు వర్ల రామయ్యను పంపిస్తానని చెప్పి మోసం చేసారని, నేటికీ దళితులు ఆ విషయాన్ని మరవలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే అన్ని వర్గాలకు మేలు జరిగిందని వారు పేర్కొన్నారు.

కాలువల్లో గుర్రపుడెక్క త్వరితగతిన తొలగించాలి



మాట్లాడుతున్న ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ డివిజన్ ఇంజనీర్ నాగార్జున

దెందులూరు: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రైతులకు సాగునీటి సమస్యలు లేకుండా చివరి ఆయకట్టు పొలం వరకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని గోదావరి కాలువ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ డివిజన్ ఇంజనీర్ నాగార్జున అన్నారు. శనివారం దెందులూరు మండలం గుండుగొలను సెక్షన్ కార్యాలయంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగార్జున, ఏఈ సుబ్రహ్మణ్యం, మల్కాపురం సాగునీటి వినియోగదారుల సంఘం డీసీ చైర్మన్ వెలమాటి రామచంద్ర ప్రసాద్ (రాంబాబు), సత్యనారాయణపురం సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పర్వతనేని రంగారావుతో కలిసి సమావేశమయ్యారు. మే నెల 2024లో పూళ్ల నుంచి గుండుగొలను వరకు రూ.28 లక్షల వ్యయంతో చేపట్టిన గుర్రపు డెక్క తొలగింపు పనులు పూర్తి చేయకపోవడంతో కాంట్రాక్టర్‌పై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి నాగార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. వేగవంతంగా పనులు పూర్తి చేయకుంటే కాంట్రాక్టు రద్దుచేసి సాగునీటి వినియోగదారులకు కాంట్రాక్టు బాధ్యతను అప్పగిస్తామన్నారు. అనంతరం సత్యనారాయణపురం దెందులూరు మల్కాపురం కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు, సాగునీటి వినియోగదారు సంఘం అధ్యక్షుడు పర్వతనేని రంగారావు, రైతులతో కలిసి అధికారులు పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



దెందులూరు శ్రీ విష్ణు ఆలయంలో పూజలు చేస్తున్న యువతులు, మహిళలు

దెందులూరు: దెందులూరు శ్రీ విష్ణు ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని సామూహిక దీపారాధనలో పాల్గొన్నారు.

పాదయాత్ర భక్తులకు అన్నప్రసాదం వితరణ



గోపినాథపట్నంలో భోజనాలు చేస్తున్న భక్తులు



ఆహారం వడ్డిస్తున్న సిబ్బంది

ఉంగుటూరు: లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ద్వారా గోపినాథపట్నంలో ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహారం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమం భక్తులకు విశేషంగా ఉపయోగపడుతోంది. కాలినడకన ఏలూరు, పశ్చిమగోదావరి, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి చాలా మంది భక్తులు కాలినడకన ద్వారకాతిరుమల వెళుతున్నారు. భక్తులు సేద తీరేందుకు అవసరమైన వసతిని లక్ష్మీనారాయణ ట్రస్టు బాధ్యులు ఏర్పాట్లు చేశారు. ట్రస్టు ప్రారంభ సమయంలో కేవలం శుక్ర, శనివారాలు మాత్రమే భోజనాలు, అల్పాహారం అందజేసేవారు. ప్రస్తుతం ప్రతి రోజు కాలినడకన వచ్చే భక్తులకు అల్పాహారంతో పాటు భోజనాలు అందిస్తున్నారు. దీంతో భక్తులు కొంత సమయం సేద తీరి ద్వారకాతిరుమల వెళుతున్నారు. జాతీయ రహదారికి కూతవేటు దూరంలో చేబ్రోలు దాటగానే గోపినాథపట్నం వస్తుంది. ఆ రోడ్డును ఆనుకుని ఈ యాత్రికులకు వసతి ఏర్పాటు చేశారు. కొంత సమయం సేద తీరిన తరువాత భక్తులు గొల్లగూడెం, నల్లమాడు, దూబచర్ల, రాళ్లగుంట మీదుగా ద్వారకాతిరుమల వెళుతున్నారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత



గణపవరంలో రామకృష్ణ మఠం స్వామీజీని సత్కరిస్తున్న భక్తులు

గణపవరం: సమాజంలో ఆధ్యాత్మిక భావన పెంపొందితే ప్రజలంతా ప్రశాంతంగా సుఖంగా జీవించడానికి మార్గం ఏర్పడుతుందని రామకృష్ణమఠం స్వామీజి బోధ దీపానంద మహరాజ్ అన్నారు. గణపవరం మండలం సరిపల్లె టీటీడీ కల్యాణ మండపం ఆవరణలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో మూడు రోజులుగా శ్రీకృష్ణతత్వం, భగవద్గీత సారాంశంపై భక్తులకు ఆధ్యాత్మిక ఉపన్యాసం ఇస్తున్నారు. శనివారం ప్రవచనాల ముగింపు సందర్భంగా భక్తులు ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత హ్యాండ్‌లూమ్స్ డైరక్టర్ నంద్యాల రామలింగరాజు మాట్లాడుతూ ప్రజలలో ఆధ్యాత్మికతను పెంచడానికి రామకృష్ణ మఠం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇతిహాసాల నుంచి మనం నేర్చుకున్న విషయాలను ఆచరణలో చేసి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారి రోహిత్‌రాజు, ప్రధాన అర్చకుడు పవన్ కుమార్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో ఆశాజనకంగా వరి దిగుబడి

పెదపాడు: ఏలూరు జిల్లాలో 2024–25 ఖరీఫ్ సీజన్‌కు పంట కోత ప్రయోగాలు ముగింపు దశలో ఉన్నట్లు జిల్లా అర్థ గణాంక అధికారి బి.శ్రీదేవి పేర్కొన్నారు. దిగుబడి ఆశాజనంగా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో సరాసరి దిగుబడి ఎకరానికి 32 నుండి 35 బస్తాల వరకు వస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 318 యూనిట్లలో దాదాపు 1,344 ప్రయోగాలు చేసినట్లు తెలిపారు. పంట కోత ప్రయోగాలు పర్యవేక్షణ నిమిత్తం రాష్ట్ర సంచాలకులు అర్థ గణాంక శాఖ కార్యాలయం ఉప సంచాలకులు జె సౌజన్య, ముగ్గురు సహాయకులు యు రమేష్ బాబు, రామారావు, ఎస్ బీమరాజు ఉప గణాంకాధికారులు ఎస్సై శేషుబాబు, జీవి వెంకటేశ్వరరావు, సహాయ గణాంకాధికారులు శ్రీనివాసప్రసాద్, ఎవీఎస్ నాగబాబుతో కలిసి పెదపాడు మండలంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. పెదపాడు మండలంలోని నిర్వహించిన పంట కోత ప్రయోగాలను పర్యవేక్షించారు. పర్యవేక్షణ ప్రయోగాల ద్వారా దిగుబడి ఆశాజనకంగా ఉన్నట్లు ఎకరానికి సరాసరి 35 బస్తాల దిగుబడి నమోదైనట్లు రాష్ట్ర అర్థ గణాంక శాఖ ఉపసంచాలకులు కె.సౌజన్య తెలిపారు.

అంగట్లో అనారోగ్యం

- చిన్నారుల పాలిట శాపంగా రంగుల ప్యాకెట్లలో తినుబండారాలు
- ప్రతి గల్లీలో యథేచ్ఛగా నాణ్యతలేని చిరుతిళ్ల విక్రయం
- పట్టించుకోని అధికారులు



భీమడోలులో ఓ దుకాణం వద్ద రంగుల ప్యాకెట్లలో చిరుతిళ్లు

భీమడోలు: రంగుల ప్యాకెట్లలో ఆకట్టుకునే చిరుతిళ్లు చిన్నారుల ఆరోగ్యంపాలిట శాపంగా మారుతున్నాయి. ఇలాంటి చిరుతిళ్లు వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. మారుతున్న జీవన విధానంతో జంక్ ఫుడ్స్‌కు అలవాటు పడిన చిన్నారులు ఆరోగ్యం బారిన పడుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని ప్రతి గల్లీలో నాణ్యత లేని రంగురంగుల ఆహార పదార్థాలు దర్శనమిస్తున్నాయి. వాటి తయారీదారులు జిమ్మిక్కులతో పిల్లలను ఆకట్టుకునేలా కార్టూన్ల చిత్రాలతో రంగులప్యాకెట్లతో చిరుతిళ్లను తయారీచేసి విక్రయిస్తున్నారు. వాటికి అలవాటు పడిన పిల్లలు తల్లిదండ్రులవద్ద మారం చేస్తూ వాటినే కొనుగోలు చేయించుకుని తింటున్నారు. కొన్ని వ్యాపార సంస్థలు క్వాలిటీని గాలికొదిలేసి పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. నాసిరకం తినుబండారాలు అందిస్తూ పిల్లల ఆరోగ్యానికి చేటు చేస్తున్నారు.

తీవ్రమైన అనారోగ్య సమస్యలు

ప్రతి రోజు ఇంట్లోని పిల్లలందరూ అంగటిలోని చిరుతిళ్లను తిని ఆనారోగ్యం బారిన పడి తల్లిదండ్రులకు ఎన్నో కష్టాలు తెచ్చిపెడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే తరుణంలో ఇంట్లో డబ్బులు తీసుకు ని పాఠశాల, అంగళ్లలోని చిరుతిళ్లను తినడంతో పిల్లలు బలహీనంగా తయారువుతున్నారు. రక్తహీనత, ఊబకాయం, మధుమేహం, గ్యాస్, గొంతు సమస్యలు, కడుపు నొప్పి, జీర్ణ సమస్యలు, క్యాన్స ర్, శ్వాసకోశ సమస్యలు వెంటాడుతున్నాయి. జీవనశైలిలో మార్పులు వచ్చి చిరుతిళ్లకే అలవాటు పడిన చిన్నారులకు అనారోగ్యంబారిన పడిన తరుణంలో తల్లిదండ్రులు ఏన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. తాగే పాలనుంచి తినే తిండి ప్రతి ఒక్కటీ కల్తీ సరుకులు మార్కెట్‌లోకి వచ్చి అతలాకుతలం చేస్తున్నాయి. ఈ తరుణంలో సరైన పోష్టికాహారం అందక అనారోగ్యంతో పాటు మందబుద్ధితో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అంగట్లో దొరకే చిరుతిళ్లకు పిల్లలు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నా తల్లిదండ్రులు వారిని అదుపు చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. వాటిపై ప్రభుత్వం తగుచర్యలు తీసుకోకపోవడంతో యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పిల్లల ఆరోగ్య శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని చిరుతిళ్లు, ఫాస్ట్ ఫుడ్స్‌కు ఎంత దూరం ఉంచగలిగితే అంత మంచిదని, లేని పక్షంలో ఆసుపత్రుల్లో చికిత్సలకు వేలాది రూపాయలు చెల్లించాల్సి వస్తుందని వైద్యులు అంటున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, నిడమర్రు, ఉంగుటూరు, గణపవరం మండలాల్లోని 200 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 25నుంచి 30వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ హానికరమైన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించాల్సి ఉంది.

విచ్చలవిడిగా కల్తీ ఆహార పదార్థాలు

కొందరు వ్యాపారులు ధనార్జనే లక్ష్యంగా నకిలీ చిరుతిళ్లను విచ్చలవిడిగా మార్కెట్లోకి వదులుతున్నారు. అవి తయారయ్యే ప్రాంతం, చిరునామా, ఎంఎఫ్‌డీ కూడా ఉండదు. కంపెనీ పేర్లు సైతం అర్థంకానివిధంగా ఉంటాయి. పాఠశాలలు, ప్రధాన వీధులు, చిరు అంగట్లో తదితర చోట్ల జోరుగా రంగుల ప్యాకెట్లలో కల్తీ ఆహార పదార్థాలు కనిపిస్తున్నా ఫుడ్ సెఫ్టీ అధికారుల తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కనీస తనిఖీలు చేపట్టకపోవడంతో కల్తీ ఆహార పదార్థాలను తయారీదారులు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తూ పిల్లల అనారోగ్యానికి కారకులవుతున్నారు.

జంక్ ఫుడ్స్ విక్రయాలను అడ్డుకుంటాం



చిన్నారుల ఆరోగ్యాన్ని హరిస్తున్న ఆహార పదార్థాలను పాఠశాలలకు తీసుకుని రాకుండా, అదే విధంగా విక్రయాలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నాం. జంక్ ఫుడ్స్ తినడం ద్వారా చిన్న వయస్సుల్లోనే పిల్లలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు జంకు ఫుడ్స్ వల్ల కలిగే అనర్థాలను పిల్లలకు వివరించాలి.

– ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో 1, భీమడోలు

రక్తహీనత, ఊబకాయం వంటి సమస్యలు



చిరుతిళ్లు తినడం వల్ల వారిలో రక్తహీనత, ఊబకాయం వంటి అనారోగ్య సమస్యలు బారిన పడుతున్నారు. రంగుల ప్యాకెట్లతో ఉండే ఆహార పదార్థాలు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. వాటి జోలికి పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి. వైద్య ఆరోగ్య సిబ్బంది పాఠశాలల్లోను, గ్రామాల్లో వాటి వచ్చే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– వైపీ లక్ష్మణరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి, తాడేపల్లిగూడెం

ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

దెందులూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై ఫీల్డ్ అసిస్టెంట్లు దృష్టి సారించి, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. దెందులూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం మండల ఉపాధి హామీ పథకం తనిఖీ పబ్లిక్ ఫారం అధికారి దామోదర్, విజిలెన్స్ అధికారి పురుషోత్తం, ఎంపీడీవో శ్రీదేవి, జాతీయ ఉపాధి పథకం ఏపీవో దశరథరాంజీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని 17 పంచాయతీల్లో 2023 –2024 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఇంకుడు గుంతలు లేకుండానే ఉన్నాయని రికార్డుల్ల నమోదు చేశారని గుర్తించారు. దీనికి సంబంధించి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఉపాధిహామీ పథకం టీఏలు ఫాతిమా, శ్రావణ్, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.